# పూల హరివిల్లు

- టి.శ్రీవాణీరమణ

సన్నగా వర్షం మొదలయ్యింది. మెల్లమెల్లగా, చల్లచల్లగా కురుస్తూనే వుంది. వానజల్లులు ఆకాశానికి ముత్యాల హారాలేసినట్లుగా కనిపిస్తున్నాయి. మా ఇంటి పూల తోటలోని రోజా పువ్వు అప్పుడే విచ్చుకుంటూ మంచులా తెల్లగా నవ్వుతున్న మల్లెపూవులతో స్నేహం చేయాలని ఉవ్విళ్ళూరుతోంది. అందంగా విరిసిన కనకాంబరాలు, చేమంతులు వానజల్లులో తడుస్తూ నాట్యం చేస్తున్నాయి. ఆ దృశ్యాన్ని చూస్తూ ఆనందిస్తూ కూర్చున్నాను. ఇంతలో ఫోన్ రింగ్ అయింది. మావారు ఫోన్ తీసి-

"శృతీ! నీకోసం హైదరాబాద్ నుంచి. నీ ఫ్రెండ్ వీణ లైన్లో వుంది" అని చెప్పడంతో ఒక్క ఉదుటున ఫోన్ అందుకున్నాను.

"హలో శృతీ! ఎలా వున్నావు? మీ పాప ఎలా వుంది?" అంది వీణ.

"బావున్నాను. మా పాప చాలా బాగుంది. ఈమధ్య నువ్వు ఫోన్ కూడా చేయలేదు" అన్నాను.

"ఎక్కడ శృతీ! ఎడతెరపిలేని పనులు, పిల్లల చదువులు, ఇంటి పనుల్లో తీరికేలేదు. అయినా ఈవారంలో మావారు పనిమీద ఊరెళుతున్నారు. వీలు చేసుకుని నేను నీవద్దకు రావాలనుకుంటున్నాను" అంది వీణ.

"ఓవ్... ఎంత శుభవార్త చెప్పావ్. ఇన్నిరోజులకి నామీద దయ కలిగిందన్నమాట. వీలు కాలేదని మళ్ళీ మానేయకు. ఎలాగైనా నువ్వు తప్పకుండా రావాలి. నిన్ను చూడక చాలారోజులయింది" అన్నాను.

వీణ ఫోన్‌చేసి వస్తున్నట్లు చెప్పేసరికి నా మనసు ఆనంద తరంగమే అయ్యింది. ఏ పని చేస్తున్నా వీణను గురించిన ఆలోచనలే. వీణ మాట్లాడితే వీణ మీటినట్టే వినిపిస్తుంది. గాలి వీస్తే ఊగే పూలరెమ్మలా, పాట పాడితే నవ్వే చిన్నిపాపలా ఆమె నాకు కన్పిస్తుంది. ఆమె వున్నంతసేపు ఇంట్లో నవ్వుల తోరణాలు కడ్తుంది. ఆమెను చూస్తే నాకు పూల హరివిల్లే అన్పిస్తుంది. అల్లరి సరిగమల రాగాలతో మా ఇంటిని సంగీత కచేరి చేస్తుంది. వేయి మాటలెందుకు ఒక్క నవ్వు చాలదా అన్నట్లుండే నేను కూడా ఆమె వస్తే మాటలతో కోటలు కడతాను. ఆమె వస్తే సీతాకోకచిలుకలా కన్పించే నేను ఆమె రాకపోతే గొంగళి పురుగులా మూడీగా వుంటాను. మా జాజి చెట్టు పూలన్నీ మాలలల్లి జడలో అలంకరించుకోవడం మా ఇద్దరికీ ఎంతో ఇష్టం. స్నేహ పరిమళాన్ని నా గుండెల్లో నింపి టాటా చెప్పి వెళ్లిపోతుంది. మళ్ళీ రాకలో ఎన్ని నవ్వుల ముత్యాల హారాలు తెస్తుందోనని నా ఎద సంద్రంలో స్నేహ మాధుర్యం అలలా ఉరకలేస్తుంది.


ఈమధ్యకాలంలో నేను- ఆమె కలుసుకోవడం తగ్గిపోయింది. దాదాపు నాలుగేళ్ళు అయింది. ఉత్తరాలు, ఫోన్లు తప్ప రాకపోకలు వీలుపడడంలేదు. ఆమె వస్తుందంటేనే నా మనసులో ఏదో తెలియని ఆనందం నిండిపోయింది.

ఆమె వచ్చేరోజున రైల్వే స్టేషన్‌కి వెళ్లి రిసీవ్ చేసుకున్నాను. ఆమెని, ఆమె ఇద్దరి పిల్లల్ని చూసి ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాను. వీణలో ఏ మార్పూ లేదు. అదే నవ్వు, అదే ఉత్సాహం. మద్రాసంతా చూపించాను. వారంరోజులు ఉండి హైదరాబాద్ వెళ్లిపోయింది. తను వున్న వారంరోజులు మా పాప, వీణ ఇద్దరు పిల్లలు ఇల్లంతా సందడి చేస్తూ తిరిగారు. ఈసారి వచ్చినప్పుడు మీవారిని కూడా తీసుకుని రావాలని నేనూ, మావారు చెప్పడంతో అలాగే అంది వీణ.

వీణని చూస్తే అప్పటికీ ఇప్పటికీ ఏమీ మారలేదన్పించింది. అదే చిరుమందహాసం, అదే స్నేహం. ఆమె నన్ను ఎంతగానో ఇష్టపడుతుంది అని చెప్పడానికి ఆమె నాకు ప్రజెంట్ చేసిన చీర ఒక ఉదాహరణ. ఆ చీరపై ఎంతో అందంగా ఎంబ్రాయిడరీ చేసిన నెమళ్ళు. నెమళ్లంటే నాకెంతో ఇష్టమని నాకోసం కుట్టి తీసుకొచ్చింది. నాకున్న అన్ని చీరల్లోకి అది ఇష్టమైనదిగా మారిపోయింది. తనకోసం నేను వేసి ఇచ్చిన అందమైన పెయింటింగ్ చూసి ఎంతో మెచ్చుకుంది.

***

ఒకసారి అనుకోకుండా హైదరాబాద్‌లో పెళ్లికని వెళ్లి వీణని చూడాలనిపించి అడ్రస్ పట్టుకుని ఇంటికి వెళ్లాను. నన్ను, నా పాపను చూసి ఎంత




ఆనందపడిందో చెప్పలేను. వీణ వుంటున్న ఇల్లు చాలా చిన్నది. వాళ్ళకే ఇరుకుగా వుంది. కానీ రాక రాక వచ్చానని, రెండురోజులైనా ఉండాలని పట్టుబట్టింది. మరోసారి వస్తానన్నా వినలేదు. ఆ ఇంట్లో డబ్బుకేగానీ, ఆదరణకు, ఆప్యాయతకు లోటులేదని గ్రహించాన్నేను.

నేను అడగడానికి సంకోచిస్తూనే అడిగాను.

"వీణా! నీ పెళ్ళప్పుడు మీవారు బిజినెస్ మ్యాగ్నెట్ అని, బాగా వున్నవాళ్ళనీ చెప్పారు. మరి ఇప్పుడు ఇలా..." అంటూ ఆగాను.

వీణ నవ్వింది. ఆ నవ్వులో బాధలేదు, భారమూ లేదు. బడిలో చదువుతున్నప్పుడు ఏదైనా లెక్క రాలేదంటే నేను అడగ్గానే ఇలాగే నవ్వేది. ఆ సమస్యను ఎంతో తేలిగ్గా పరిష్కరించేది. ఇప్పుడూ అలాగే నవ్వింది.



ఆ నవ్వుతో నాలో కోటి ఆశలు నింపింది. ఆ నవ్వు నాకెంతో ధైర్యాన్నిచ్చింది. ఆ నవ్వు ఎన్నో బాధల్ని తరిమికొట్టింది. నెమ్మదిగా సన్నజాజి మొగ్గలు తెంపుతూ చెబుతోంది.

"శృతీ! మా ఆయన బిజినెస్‌లో లాస్ అయ్యారు. ఉన్న ఆస్తి అంతా అప్పులు కట్టారు. ఈ ఇల్లు మాత్రం మాకు ఉండిపోయింది. ఇప్పుడు ఆయన చిన్న ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన జీతం మా ఖర్చులకే సరిపోతోంది. నేనూ ఖాళీ సమయాల్లో ఎంబ్రాయిడరీ చేసి, ట్యూషన్స్ చెప్పి ఎలాగో కొంత సంపాదిస్తున్నాను. అయినా మేము పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొని నిలబడగలిగామంటే మా ఇద్దరి మధ్య వున్న ప్రేమ, అవగాహనలే కారణం. పెళ్లయిన తరువాత నాలుగేళ్ళు ఐశ్వర్యంలో తులతూగాము. అప్పుడు అందరూ చుట్టాలు, స్నేహితులు వచ్చి పోతూ ఉండేవాళ్ళు. కానీ ఇప్పుడు మాకు మేమే చుట్టాలు, స్నేహితులు- అన్నీను. ఏదో లాసయ్యామని ప్రతిక్షణం కృంగిపోతూ మరెన్నో క్షణాల్ని పోగొట్టుకోవడం మాకిష్టంలేదు. అందుకే అసలు మొదలే చిన్న ఉద్యోగస్తులమైతే ఎలా వుండేవాళ్ళం అని ఆలోచిస్తూ ఖర్చులన్నీ తగ్గించుకున్నాం. అయ్యో.. అని డీలా పడకుండా పోయినదాన్నుంచి గుణపాఠం నేర్చుకున్నాము. భవిష్యత్తు మనదే అని, ఎన్ని కష్టాలైనా నాకు నువ్వు తోడుంటే తట్టుకోగలను అని ఒకరికొకరం ధైర్యం చెప్పుకున్నాం. అట్లాగే నెట్టుకొస్తున్నాం. ఇప్పుడు ఫర్వాలేదు. పిల్లలిద్దర్నీ మంచి స్కూల్లో వేయగలిగాం. అయినా డబ్బులోనే ఆనందం వుంటుందనేది తప్పు. సుఖాలు- మనసుల్ని దూరం చేస్తాయి. కష్టాలు మనుషుల్ని దగ్గర చేస్తాయి. మాకు డబ్బు శాశ్వతం కాదన్న విషయం అర్థమయింది. ఇప్పుడు మేము మాకు మా ఆప్యాయతానురాగాలే ఆస్తులుగా భావిస్తున్నాం" చెప్పుకుంటూ పోతోంది వీణ... వీణ మీటుతున్నట్లుగా.

వింటున్న మా మనసు శృతి చేసిన వీణ అయింది. స్వరాల ఝరిలో తేలిపోయింది. మనసు మల్లెల మందహాసమైంది. నాకేదో ప్రశ్నకు సమాధానం దొరుకుతున్నట్లుగా, ఏదో చిక్కు లెక్క సాధించినట్లుగా ఉంది.

ఎక్కడో మరో ప్రపంచపు సరిహద్దుల్లో ఆనందం, ఆప్యాయతల్ని కలిపి మాల కడుతున్నట్లుగా ఉంది. ఆ ఇంట్లో ఇరుకుదనం ఎక్కడుంది, విశాల విశ్వ స్వరూపం కళ్ళ ముందుంచిన అరుదైన ఆత్మీయత తప్ప. నాకు తెలియకుండానే వీణతో ఏదో చెబుతున్నా-

"వీణా! నిన్ను చూస్తుంటే ఎంతో ఆనందంగా వుంది. మరెంతో గర్వంగా కూడా వుంది. నాకెప్పుడూ చిక్కులెక్కలు సాధించి పెట్టే నువ్వు ఇన్ని చిక్కు సమస్యల్ని ఎదుర్కొంటున్నావని ఎప్పుడూ చెప్పలేదు. మైనస్ ఎమైనస్ ప్లస్ అని నాకిప్పుడు సంపూర్ణంగా అర్థమైంది. చదువుకునేటప్పుడు మాకన్నా మీరు వున్నవాళ్ళవడం చేత, నువ్వు ఆనందంగా ఉన్నావనుకునేదాన్ని కానీ డబ్బులో ఆనందం లేదని, నీ మనసులోనే ఉందని నిన్ను చూస్తే అన్పిస్తుంది. గలగలా పారే సెలయేటి పాటలా, ఆనందంగా సాగే నీ మాటల ప్రవాహంతో ఎప్పుడూ ఆశలే నింపుతుంటావు. ప్రొద్దున లేచింది మొదలు ఆడంబరాల గాంభీర్యం తప్ప, ఆప్యాయతానందాలెరుగని ఎందరో నిన్ను చూచి నేర్చుకోవలసింది ఎంతో వుంది. ఐశ్వర్యం ఉన్నప్పుడు గర్వపడక, అది లేనప్పుడు నిస్పృహ దరిచేరనీక అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ నువ్వు ఆనందపు కోనల్లో, అనురాగపు మేడల్లో, ఆప్యాయత జల్లులలో విరిసిన పూల హరివిల్లువే సుమా!" అంటూ సన్నజాజి మాలను వీణ జడలో తురిమాను.

అప్పటికే వచ్చేసిన చందమామ మాపై వెన్నెల వాన కురిపించాడు.

★